క్లుప్తంగా

శ్యామలాంబదేవికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. తూర్పుకాపు సంఘం రాష్ట్రనాయకుడు మహంతి వాసుదేవరావు ఈ పూజల్లో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. లలితా సహస్రనామ పారాయణం, భక్త బృందం ఆధ్వర్యాన భజన కార్యక్రమం జరిగాయి.

కరాటే పోటీల్లో ప్రతిభచాటిన తస్నీమ్



పాయకాపురం(విజయవాడరూరల్): కొపుకాన్ కరాటే క్లబ్, శారద కరాటే స్కూల్ నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో రాజీవ్‌నగర్‌లోని రాజీవ్ గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థిని ఎండి.రుఫీద తస్నీమ్ ప్రతిభచాటింది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని రుఫీద తస్నీమ్ అండర్-14 విభాగంలో ఎల్లో బెల్టు సాధించింది. ఆమెను హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. కరాటే క్లబ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ వ్యాసరచన పోటీల్లో శ్రీకృష్ణ ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): హిందీ దివస్‌ను పురస్కరించుకుని దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో జరిగిన హిందీ వ్యాసరచన పోటీల్లో తమ కళాశాల విద్యార్థి బి.వి.ఎస్.ఎస్.శ్రీకృష్ణ ప్రథమ బహుమతి పొందాడని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. కళాశాల ఆవరణలో శ్రీకృష్ణను మంగళవారం అభినందించారు. కళాశాల విద్యార్థిని ముస్తఫాకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేశారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, హిందీ విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మి, అధ్యాపకురాలు ఎం.భవ్యతో పాటుగా విద్యార్థులు శ్రీకృష్ణను అభినందించారు.

పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు



పటమట(విజయవాడతూర్పు): పర్యాటక రంగంలో అనేక నూతన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉపాధి పొందొచ్చని స్టెల్లా కళాశాల చరిత్ర విభాగాధిపతి బ్యూలా నోయల్ సూచించారు. కళాశాలలో మంగళవారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నోయల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ జసింత క్వాడ్రస్, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉష, అధ్యాపకులు ప్రశాంత దాస్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో పూజితకు గోల్డ్ మెడల్



పాయకాపురం(విజయవాడరూరల్): ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన పదో తరగతి విద్యార్థిని పూజితను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్‌లో వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం జరిగింది. స్కేటింగ్ పోటీల్లో పూజిత అండర్ 15-17 విభాగంలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించిందని ఇన్‌చార్జి హెచ్‌ఎం హుస్సేన్ తెలిపారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను కూడా అభినందించారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ధ్యేయం

రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



వాంబే కాలనీలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పరిపాలన వికేంద్రీకరణ కార్యరూపం దాల్చడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల్లో నుంచి పుట్టిన గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థే కారణమని పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 60, 61 డివిజన్లలో రూ.1.40 కోట్లతో నిర్మించిన రెండు సచివాలయాల నూతన భవనాలను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో రాష్ట్ర ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలు ఏమిటో యావత్ దేశమంతా చూసిందన్నారు. నిజమైన పరిపాలన వికేంద్రీకరణ సాకారమవడానికి కారణం సచివాలయ వ్యవస్థేనని స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రజలు వేసిన ఒక్క ఓటుతో వారి ఇళ్ల చుట్టూ ఎంతమంది అధికారులు తిరుగుతున్నారో దేశమంతా చూస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి పథకం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలన అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, బి.హెచ్.ఎస్.వి.జానారెడ్డి, యరగొర్ల తిరుపతమ్మ, కోఆప్షన్ సభ్యుడు సందెపు జగదీష్, పలువురు కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు భూమిపూజ

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక నుంచి సుభాష్ చంద్రబోస్ కరకట్ట వరకు 2.9 కిలోమీటర్ల పొడవుగల రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ రోడ్డు అభివృద్ధికి డీఎంఎఫ్ నిధులు రూ.3.40 కోట్లతో ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మేడా రమేష్, అవుతు శ్రీనివాసరెడ్డి, యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్, పందిరి వాసు, సొసైటీ చైర్మన్ ఎం.రవీంద్రరెడ్డి, పాలకేంద్రం చైర్మన్ దేవిరెడ్డి మంగారెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, సాదం శ్రీనివాసరావు, సాదం వెంకటేశ్వరావు, దేవిరెడ్డి కిరణ్‌రెడ్డి, మరీదు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మన్ శక్తిపీఠం వార్షికోత్సవాలు



పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాల ప్రాజెక్టు సమీపంలోని శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం 13వ వార్షికోత్సవాలు, వినాయక చవితి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహా పూర్ణాహుతిని పీఠాధిపతి కరుమారి దాస్ ఆధ్వర్యంలో జ్ఞానేశ్వర్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. చలువాది ప్రకాష్ దంపతులు, లక్ష్మీనారాయణ గుప్తా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన అవసరం



ఫ్లవర్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఇండియన్ స్వచ్ఛత 2.0 స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా సింగ్‌నగర్ ఎంకే బేగ్ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం స్వచ్ఛసర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. వీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌ను విద్యార్థులు సందర్శించారు. నగరంలో జరుగుతున్న ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సెల్ ప్లాంట్‌లోని వర్మి కంపోస్ట్ ప్లాంట్, బయో మిథనేషన్ ప్లాంట్, పూల వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మ్యానేజ్‌మెంట్ ప్లాంట్లను విద్యార్థులు సందర్శించారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా, కార్పొరేషన్ అధికారులు ప్లాంట్ల నిర్వహణను వివరించారు. నిత్యం నగరంలో సేకరిస్తున్న పొడి చెత్తను విద్యుత్ తయారీ కోసం జిందాల్ ప్లాంట్‌కు, తడి చెత్తను వర్మి కంపోస్ట్ యూనిట్లలో ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ హఫీజుల్లా, శానిటరీ సూపర్‌వైజర్, స్వచ్ఛ సర్వేక్షణ్ టీం, స్కూల్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు దమ్మ గీతాల గ్రంథావిష్కరణ

గుణదల (విజయవాడ తూర్పు): తమ కళాశాలలో దమ్మగీతాల గ్రంథావిష్కరణ కార్యక్రమం బుధవారం జరుగుతుందని ఆంధ్రలయోల కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎ.పి.కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ రచయితలు పి.భారతి, టి.సీతారామిరెడ్డి రచించిన దమ్మ గీతాల గ్రంథం ఇటీవల పూర్తయిందన్నారు. వేమన జయంతి ఉత్సవ కమిటీ, ఆంధ్ర లయోల కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ గ్రంథావిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్, ఏపీ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ చీఫ్ కమిషనర్ ఎండీ ఇంతియాజ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. బుధవారం సాయంత్రం లయోల కళాశాల ఆవరణలోని బిషప్ ముమ్మడి ఇగ్నేషియస్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ డివిజన్ ఈఈ బి.వి.సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశం రోడ్డు, నక్కలరోడ్డు, వెంకటరత్నం వీధి, భవానీ వీధి, విష్ణువర్ధనరావు వీధి, మాదిరెడ్డి వారి వీధి, కాళేశ్వరరావు రోడ్డు, డోర్నకల్ రోడ్డు, నరసింహారావు నాయుడు వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, చిలుకు దుర్గయ్య వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి, టొబాకో బ్యారెన్ స్ట్రీట్, డాక్టర్ ఎస్.సుబ్బారావు వీధి, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, వేమూరి వారి వీధి, జడగం వారి వీధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాయకాపురం గాయత్రీ విద్యాలయంలో ఐదు నుంచి పదేళ్ల లోపు చిన్నారులకు మంగళవారం చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో జీఎం వై.రవీంద్రనాథ్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని అధికారులు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి 12 నెలలపాటు బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ నెట్ ప్లాన్ 599, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి ఆరునెలలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి మూడు నెలలపాటు ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

తీరనున్న చిరకాల కోరిక

- ఏలూరు కాలువపై మరో వంతెన నిర్మాణానికి చర్యలు
- మధురానగర్ పప్పులమిల్లు వద్ద వంతెన నిర్మించేందుకు ప్రతిపాదనలు
- వంతెన నిర్మాణానికి రూ.5.5 కోట్ల నిధులు మంజూరు



వంతెన నిర్మించనున్న ప్రాంతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏలూరు కాలువపై మరో వంతెన నిర్మాణం జరగనుంది. మధురానగర్, వెంకటేశ్వరనగర్, హనుమాన్ నగర్, విజయదుర్గానగర్, కేఎల్‌రావు నగర్, లెనిన్ నగర్ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరనుంది. మధురానగర్, వెంకటేశ్వరనగర్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి బుడమేరు మధ్యకట్ట, విజయదుర్గానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రస్తుతం పప్పుమిల్లు రోడ్డు సమీపంలో ఏలూరు కాలువపై ఫుట్ బ్రిడ్జి మాత్రమే అందుబాటులో ఉంది. ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు, రిక్షా తదితర వాహనాలు వచ్చినప్పుడు ఫుట్‌బ్రిడ్జిపై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లే సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్ర ఇబ్బందిగా మారాయి. ఈ ఇబ్బందుల కారణంగా కొంత మంది చుట్టూ తిరిగి మధురానగర్ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీని వల్ల విలువైన సమయంతో పాటు ఇంధనం వృథా అవుతోంది. అత్యవసర సమయాల్లో 108 వంటి వాహనాలు బుడమేరు మధ్యకట్ట ప్రాంతాలకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు అధికారులతో మాట్లాడి ఏలూరు కాలువపై మధురానగర్ పప్పులమిల్లు సమీపంలోని ఫుట్ బ్రిడ్జి వద్ద కొత్తగా వంతెన నిర్మించేందుకు రూ. 5.5 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం వంతెన నిర్మాణానికి టెండర్ పిలుస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే వంతెన పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ చిరకాల కోరికను తీరుస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ప్రస్తుతం ఉన్న ఫుట్‌బ్రిడ్జి

సమస్యకు పరిష్కారం



ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. అదే స్ఫూర్తితో ఎమ్మెల్యే మల్లాది విష్ణు సెంట్రల్ నియోజకవర్గానికి సేవలు అందిస్తున్నారు. మధురానగర్ అభివృద్ధిలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాత్ర ఎనలేనిది. మధురానగర్ పప్పులమిల్లు సమీపంలో వంతెన అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ వంతెనకు అనుసంధానంగా బుడమేరుపై కూడా వంతెన నిర్మిస్తే గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతుంది.

–పిల్లి కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నగర మహిళ అధ్యక్షురాలు

ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు



మధురానగర్‌లో గణనాథుడు



శివకామేశ్వరీ పీఠంలో విజయగణపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గణపతి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఆకాంక్షించారు. ముత్యాలంపాడులో శ్రీబాల గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులను అభినందించారు. గణపతికి గరికతో పూజలు చేశారు. బుధవారం పెనుమత్స సత్యం ఆధ్వర్యంలో అన్నదానం చేస్తామని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో మంగళవారం విజయగణపతికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఎనిమిది రోజులుగా రోజుకో అలంకారంలో పూజలు అందుకున్న విజయగణపతి నిజరూప దర్శనంతో పూజలు అందుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. మధురానగర్ ఏటీఎం రోడ్డులో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అన్నదానం జరిగింది. సుమారు మూడు వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను శ్రీను, ఎంపద్మజ పర్యవేక్షించారు.



ముత్యాలంపాడులో పూజలందుకున్న గణేషుడు

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని రాజా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయనకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ప్రాచ్య గ్రంథాలపై ఆసక్తి పెంచుకోవాలి



హైస్కూల్ లైబ్రరీలో పెట్టేందుకు గ్రంథాలను బహూకరిస్తున్న అన్నపూర్ణ, డాక్టర్ రమేష్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రాచ్య, తాళపత్ర గ్రంథాలను చదివి వాటిపై ఆసక్తిని పెంచుకోవాలని ప్రాచ్య లిఖిత గ్రంథాలయం సహాయ సంచాలకురాలు టి.అన్నపూర్ణ సూచించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో జిల్లా గెజిటీర్ల శాఖ, ప్రాచ్య లిఖిత గ్రంథాలయం సంచాలకుడు డాక్టర్ వి.గంగరాజు నేతృత్వంలో మంగళవారం ప్రాచ్య లేఖనాలయిన తాళపత్ర గ్రంథాలు, పురాతత్వ లేఖలు, జిల్లా గెజిటర్లకు సంబంధించిన అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సనాతన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి పురాతన గ్రంథాలు, తాళ పత్ర గ్రంథాల ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చని అన్నారు. ఆ గ్రంథాలను పురావస్తు శాఖ మ్యూజియాల్లో భద్రపరుస్తుందని చెప్పారు. ఠాగూర్ నేషనల్ పరిశోధకుడు (న్యూ ఢిల్లీ) డాక్టర్ పారా రమేష్‌బాబు మాట్లాడుతూ.. రాజుల కాలం నాటి శాసనాల్లో ఉన్న అంశాలతోపాటు తాళపత్ర గ్రంథాల్లో పేర్కొన్న పురాణ, ఇతిహాసాలకు సంబంధించిన విషయాలను అచ్చ తెలుగులోకి తర్జుమా చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వాటిని చదివి అవగాహన చేసుకుంటే నాటి కాలానికి చెందిన అనేక విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గెజిటీర్ల శాఖ, ప్రాచ్య లేఖల కార్యాలయ సిబ్బంది ఎన్‌హెచ్ రాజు, సీనియర్ అసిస్టెంట్ వై.సతీష్, జూనియర్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, హెచ్‌ఎం డేవిడ్ రాజు, హైస్కూల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లోని లైబ్రరీలో పెట్టేందుకు సంస్థ తరపున కొన్ని ప్రాచ్య గ్రంథాలను బహూకరించారు.

కళావికాసానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలి



ప్రసంగిస్తున్నపట్టాభిరామయ్య

విజయవాడ కల్చరల్: కళావికాసానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని నాటికల పోటీ నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య కోరారు. సుమధుర కళానికేతన్, ఆంధ్ర నాటక కళా సమితి, సిద్ధార్థ కళాపీఠం, జాషువా సాంస్కృతిక కళా వేదిక ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో మూడు రోజులపాటు నిర్వహించే నాటిక పోటీలు బందరు రోడ్డులోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టాభి రామయ్య మాట్లాడుతూ నేటి యువత సామాజిక మాధ్యమాల ప్రభావంతో సాంస్కృతిక కళారంగాలకు దూరంగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సిద్ధార్థ అకాడమీ చైర్మన్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సాహిత్యం సమాజ పురోభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డాక్టర్ నన్నపనేని నాగేశ్వరరావు, చెన్నుపాటి వజీర్, నాటక ప్రయోక్త వైఎస్ కృష్ణేశ్వరరావు ప్రసంగించారు. సమాజ వికాసం కలగాలంటే మహిళలు, పురుషులు అన్న తేడా ఉండకూడదన్న సందేశంతో పీబీ సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులు 'ఇంతేనా' నాటికను ప్రదర్శించారు. రెండో నాటికగా దంతవేదాంతం నాటికను ప్రదర్శించారు. దీనికి రచన కీర్తిశేషులు భమిడిపాటి రాధాకృష్ణ, దర్శకత్వం డాక్టర్ నేమాని శారద వహించారు. మూడో నాటికగా హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు ఊసరవెల్లి నాటిక ప్రదర్శించారు.

విద్యార్థులకు ఆన్‌లైన్‌లో డిజిటల్ పెయింటింగ్ పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులకు డిజిటల్ పెయింటింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఆన్‌లైన్ డిజిటల్ పెయింటింగ్ కాంటెస్ట్‌లను నిర్వహిస్తున్నామని ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సంస్థ సభ్యుడు స్ఫూర్తి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5,6,7 తరగతుల విద్యార్థులు సబ్ జూనియర్, 8,9,10 తరగతుల వారు జూనియర్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులు ఈ పోటీల్లో ఉచితంగా పాల్గొనవచ్చని సూచించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమకు నచ్చిన అంశంపై డిజిటల్ ఆర్ట్ వేయవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ ఐదో తేదీలోగా ఎఫ్ఎఫ్ఏడిజిటల్‌పెయింటింగ్‌కాంటెస్ట్‌ఎట్‌దిరేట్‌జీమెయిల్.కామ్‌కు డిజిటల్ పెయింటింగ్, విద్యార్థి పేరు, చిరునామా, ఫోన్ నంబరు పంపాలని సూచించారు. మెయిల్‌కు పంపే ఫైల్ సైజు రెండు నుంచి నాలుగు ఎంబీ మధ్య ఉండాలని స్పష్టంచేశారు. అక్టోబర్ 7,8 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో విద్యార్థులు పంపిన చిత్రాలతో పెయింటింగ్ ఎగ్జిబిషన్, ఉత్తమ చిత్రాలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

స్వచ్ఛత ప్రతిజ్ఞ

పాయకాపురం(విజయవాడరూరల్): స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో మంగళవారం వైద్యులు, సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. ఓపీ రోగులకు శానిటైజర్లు, మాస్కులు, సబ్బులు పంపిణీ చేశారు.